
సాక్షి గుంటూరు

శుక్రవారం ׀ 3 ׀ జనవరి ׀ 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి చిలకలూరిపేట వెంగళ్రావునగర్‌కు చెందిన నాగండ్ల అద్రిత్ కుటుంబం రూ. లక్ష విరాళం ఇచ్చింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 569.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,019 క్యూసెక్కులు వదిలారు.



బగళాముఖి సేవలో మనో

చందోలు(కర్లపాలెం): ప్రముఖ సినీ నేపథ్య గాయకులు మనో దంపతులు గురువారం చందోలు బగళాముఖి అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

న్యూస్‌రీల్

క్యాలెండర్ ఆవిష్కరణ



నగరంపాలెం: హైకోర్టు అధీకృత క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి ఆవిష్కరించారు. జిల్లా జడ్జి బంగ్లాలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. రెండో అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజా, మూడో అదనపు జిల్లా జడ్జి సీపీఎస్ శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి, చల్లా క్రాంతి కుమార్, కృష్ణారెడ్డి, ఆర్‌కేఎస్ మూర్తి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

18వ రోజుకు ధనుర్మాస మహోత్సవాలు



తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా 18వ పాశురాన్ని గురువారం భక్తులకు త్రిదండి చిన్నజీయర్ స్వామి వివరించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ఈ మహోత్సవాలలో భాగంగా హైదరాబాద్, గుంటూరు వంటి ప్రాంతాల నుంచి సుమారు 150 మంది గోదా అమ్మవారికి సారె సమర్పించారని తెలిపారు. అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి, మంగళాశాసనాలతో కార్యక్రమం వైభవంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్యాలు అలరించాయని పేర్కొన్నారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలో మంగళగిరి పట్టణానికి చెందిన చిరంజీవి శ్రీసమన్విత ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జీయర్‌స్వామి చేతుల మీదుగా బంగారు పతకం, ఆశీస్సులు అందుకుందని తెలిపారు. మై హోమ్స్ గ్రూప్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు సతీసమేతంగా పాల్గొన్నారని అన్నారు.

ప్రశాంతంగా బీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బీపీఈడీ, ఎంపీఈడీ మూడవ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల కోఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు. వర్సిటీలోని యోగా కేంద్రంలో పరీక్షల కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష రాస్తున్న విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. వసతులను తనిఖీ చేశారు. అన్ని సౌకర్యాలు వెంటనే కల్పించాలని చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.సూర్యనారాయణకు ఆదేశాలు జారీ చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ మూడో సెమిస్టర్ పరీక్షల్లో గురువారం కొందరు విద్యార్థులు హాల్ టికెట్ లేకుండా పరీక్షకు హాజరైనట్లు పరీక్షల కో ఆర్డినేటర్ గమనించారు. ఆ విద్యార్థులను ఎగ్జామ్స్ సెంటర్ నుంచి బయటకు పంపారు. తర్వాత హాల్ టికెట్లు తెచ్చుకోవడంతో అనుమతి ఇచ్చినట్లు సుబ్బారావు తెలిపారు.

మహిళా అభ్యర్థులకు నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు



నగరంపాలెం: శుక్రవారం నుంచి మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గుంటూరు నగరంపాలెంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ నెల 3, 4, 6 వ తేదీల్లో జరిగే దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి మహిళా పోలీస్ అధికార, సిబ్బందికి జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. మూడో తేదీన 530, నాలుగో తేదీన 535, ఆరో తేదీన 536 మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1716 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 140, తూర్పు కెనాల్‌కు 174, నిజాంపట్నం కాలువకు 34, కొమ్మమూరు కాలువకు 975 క్యూసెక్కులు విడుదల చేశారు.



శంకర్ విలాస్ సెంటర్ వద్ద..



గుంటూరు రైల్వేస్టేషన్ ప్రాంతంలో...



శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై...

మంచు కురిసె.. మనసు మురిసె..

గుంటూరు నగరాన్ని మంచు ముంచెత్తుతోంది. శీతాకాలం కావడంతో పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. గురువారం మంచు ఎక్కువగా పడింది. ప్రజలు బయటకు రావడానికి మంకీక్యాప్‌లు, స్వెటర్లు ధరించాల్సి వచ్చింది. తెల్లవారుజామున, సాయంత్రం సమయాల్లో ఎక్కువగా పడుతోంది. నగరంలో తెల్లవారుజామున వర్షంలా పడటంతో పలుచోట్ల అందమైన దృశ్యాలు ఆవిష్కృతం అయ్యాయి. మరోవైపు రాకపోకలకు మాత్రం తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఉదయం 9 గంటలయ్యే వరకు రోడ్డుపై ముందున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. వాహనాలను చోదకులు హెడ్ లైట్లు వేసుకొని డ్రైవ్ చేయాల్సి వస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

కూటమి లక్ష్యం.. ఎయిడెడ్!

ప్రభుత్వ విద్యారంగాన్ని క్రమంగా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఎయిడెడ్ పాఠశాలలపై దృష్టి పెట్టింది. ప్రవేశాలు తక్కువగా ఉన్నాయనే సాకుతో వాటిని మూసివేయడానికి రంగం సిద్ధం చేసింది. ఆయా బడుల అభివృద్ధికి ప్రభుత్వ పరంగా సహకరించి, విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాల్సిందిపోయి ఏకంగా వచ్చే విద్యాసంవత్సరం నుంచి మూసివేయాలని నిర్ణయించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

- విద్యార్థుల ప్రవేశాలు లేవంటూ యాజమాన్యాలపై ఒత్తిడి
- వచ్చే విద్యాసంవత్సరానికి మూతపడనున్న పాఠశాలలు
- షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- 40 లోపు ప్రవేశాలున్న వాటి గుర్తింపు రద్దుకు సన్నాహాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 14 బడులపై వేలాడుతున్న కత్తి
- గతంలో అందరికీ మేలు జరిగేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలల మూసివేత దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాలు 40కి తక్కువగా ఉన్న పాఠశాలలకు గుర్తింపు రద్దు చేసేందుకు నిర్ణయించింది. ఆయా బడులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు వచ్చే విద్యాసంవత్సరానికి తిరిగి పాఠశాలలను పునః ప్రారంభించేందుకు వీల్లేకుండా చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ గత నెల 30వ తేదీన మార్గదర్శకాలతోపాటు సంబంధిత పాఠశాలల జాబితా విడుదల చేశారు. ఈ విధంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 14 ఎయిడెడ్ పాఠశాలలకు గుర్తింపు రద్దు చేయనున్నారు. ఫలితంగా అవి వచ్చే విద్యాసంవత్సరం నుంచి కనుమరుగు కానున్నాయి. అక్కడ పని చేస్తూ ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్న ఉపాధ్యాయులను విద్యాశాఖ ఇతర పాఠశాలలకు బదిలీ చేయనుంది. విద్యార్థులను కూడా ఇతర పాఠశాలలకు పంపనుంది. గుర్తింపు రద్దు చేయనున్న వాటిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి.



గుంటూరులోని ఓ ఎయిడెడ్ స్కూల్లో విద్యార్థులు (ఫైల్)

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భరోసా

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చి, పాఠశాలలను ఆధునికంగా తీర్చిదిద్దిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలపై సమగ్రమైన విధానాన్ని అమలు పరిచింది. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశాలు పడిపోవడంపై దృష్టి సారించారు. ప్రైవేటు రంగంతో పోటీ పడలేకపోవడంతోపాటు ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా ఎదగలేకపోవడం వంటి కారణాలతో ఎయిడెడ్ రంగాన్ని ప్రగతిబాట పట్టించేందుకు యాజమాన్యాలకు అవకాశం కల్పించారు. ఎయిడెడ్ పాఠశాలలను సిబ్బంది, ఆస్తులతోపాటు పూర్తిగా ప్రభుత్వానికి స్వాధీనం చేస్తే వాటిని ప్రభుత్వ పాఠశాలలుగా అభివృద్ధి పర్చేందుకు అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఇష్టం లేని పక్షంలో ఉపాధ్యాయులను ప్రభుత్వానికి అప్పగించి, ప్రైవేటు పాఠశాలలుగా మార్పు చేసుకోవాలని సూచించింది. దీనిపై గతంలో జిల్లాలోని పలు ఎయిడెడ్ యాజమాన్యాలు సద్వినియోగం చేసుకుని, ప్రైవేట్ పాఠశాలలుగా మార్పు చెందాయి.

ఉమ్మడి జిల్లాలో మూసివేయనున్న బడులివే..

రాష్ట్ర వ్యాప్తంగా 2024–25 విద్యాసంవత్సరంలో గుర్తింపు రద్దు చేసేందుకు నిర్ణయించిన పాఠశాలలు 56 ఉన్నాయి. వాటిలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే 14 ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. గుంటూరు జిల్లా పరిధిలోని చెంచు ఎయిడెడ్ యూపీ స్కూల్, శ్రీపొట్టి శ్రీరాములు స్కూల్, బాపట్ల జిల్లాలో ఏబీఎం ఎలిమెంటరీ స్కూల్, పాండురంగపురం స్కూల్, జేహెచ్‌డీడీఎస్ ఏపీఎస్ హస్తినాపురం స్కూల్, కేఎంపీ స్కూల్, ఎస్‌ఏఆర్‌ఆర్‌ఎంపీఎస్, ఎస్‌ఎంఏ పీఎస్, గాంధీనగర్ (చీరాల), పుల్లల సుబ్బారాయుడు తిరుపతమ్మ విద్యాపరిషత్ స్కూల్, హిందూ ఎయిడెడ్ స్కూల్, జేవీఎస్‌ఏఏ స్కూల్, నేషనల్ ఎయిడెడ్ స్కూల్, హెచ్‌ఏ యూపీఎస్, ఆర్సీఎం స్కూల్, జాగర్లమూడి ఎయిడెడ్ స్కూల్, పల్నాడు జిల్లాలో లూథరన్ స్కూల్ (యడ్లపాడు), హెచ్ యూపీఎస్, ఆర్సీఎం స్కూల్ (పోలేపల్లి), ఎల్‌హెచ్ ఫన్ బీల్డెండ్ (నరసరావుపేట), లూథరన్ ప్రైమరీ స్కూల్ గుర్తింపు రద్దు జాబితాలో ఉన్నాయి.



నగదు చూపుతున్న బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ

ఇద్దరు సైబర్ నేరగాళ్లు అరెస్టు

- బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- చుండూరు సైబర్ కేసులో విస్తృత దర్యాప్తు
- రాజస్థాన్‌లో ఇద్దరు నిందితుల అరెస్టు
- ముంబైలోనూ విస్తృత గాలింపు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

బాపట్ల: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు అపరిచిత వ్యక్తులు ఫోన్లు చేసి బెదిరిస్తే తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సూచించారు. బాపట్ల జిల్లా చుండూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన సైబర్ కేసుపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసిన పోలీసులు ఇద్దరు జాతీయ సైబర్ నిందితులు రాజేష్, శ్రవణ్ కుమార్‌లను అరెస్టు చేశారు. వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుషార్ డూడీ వెల్లడించారు. చుండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల వేటపాలేనికి చెందిన గొంది శ్రీలక్ష్మీ వరప్రసాదరావు అనే రిటైర్డ్ ప్రొఫెసర్‌ను సోషల్ మీడియా ద్వారా సీబీఐ ఆఫీసర్ అని చెప్పి, ఆయనపై మనీ లాండరింగ్ కేసు నమోదు అయిందని నేరగాళ్లు బెదిరించారన్నారు. కేసు నుంచి బయట పడాలంటే డబ్బులు ఖర్చు అవుతాయని బెదిరించి మోసపూరితంగా రూ. 74 లక్షలు తమ ఖాతాలకు బదిలీ చేయించుకొని మోసం చేశారని తెలిపారు. ఈ మేరకు బాధితుడు చుండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.

కేసును సవాలుగా తీసుకుని దర్యాప్తు

వరుసగా జరుగుతున్న డిజిటల్ తరహా సైబర్ నేరాలను దృష్టిలో ఉంచుకొని చుండూరు కేసును సవాలుగా తీసుకున్నామని ఎస్పీ తెలిపారు.బాపట్ల ఐటీ కోర్ ఎస్‌ఐ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో సాంకేతిక బృందం ఇచ్చిన సమాచారం మేరకు చుండూరు సీఐ సీహెచ్.వి. శ్రీనివాసరావు నేతృత్వంలో ఒక బృందం రాజస్థాన్ రాష్ట్రానికి, ఆర్‌ఐ శ్రీకాంత్ నేతృత్వంలో మరొక బృందం ముంబైకి వెళ్లారన్నారు. రాజస్థాన్ వెళ్లిన బృందం ఏ- 3 రమేష్‌ను పట్టుకొని అతని వద్ద నుంచి రూ.2 లక్షలు, ఏ–4 శ్రావణ్ కుమార్‌ని పట్టుకొని అతని వద్ద ఐదు లక్షలు రికవరీ చేశామన్నారు. ఆ క్రమంలో నిందితుల అకౌంట్లను తనిఖీ చేయగా వారు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, వెస్ట్ బెంగాల్, గుజరాత్ , తెలంగాణ, రాజస్థాన్.. ఇలా మొత్తం 18 రాష్ట్రాల్లో 39 జిల్లాల్లో 43 పోలీస్ స్టేషన్ల పరిధిలో రూ.12.30 కోట్ల నగదు బదిలీ జరిగినట్టు గుర్తించినట్లు చెప్పారు. వీరిలో ఏ-3 ఆరు కేసుల్లో రూ.15 లక్షలు, ఏ-4 ఏడు కేసుల్లో రూ. 35 లక్షలను తమ అకౌంట్‌కు డబ్బులు వేయించుకున్నట్లు గుర్తించామని ఎస్పీ వివరించారు. చుండూరు కేసుకు సంబంధించి ఏడు లక్షలు రికవరీ చేశామని, రెండో బృందం మహారాష్ట్రలో సైబర్ ముద్దాయిల కోసం గాలిస్తోందని తెలిపారు. చుండూరు కేసులో డబ్బులు బదిలీ అయిన నిందితుల ఐదు ఖాతాలను విచారణలో భాగంగా ఎన్సీఆర్బీ పోర్టల్‌లో పరిశీలించినప్పుడు, వీరిపై నమోదైన పలు కేసుల వివరాలు గుర్తించామని వివరించారు. ఈ కేసులో మిగిలిన నిందితులను కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

డిజిటల్ అరెస్టులనేవే లేవు..

డిజిటల్ అరెస్ట్ అనేది లేదని, భయభ్రాంతులకు గురై అపరిచితులను నమ్మి మోసపోవద్దని ఎస్పీ తుషార్ డూడీ సూచించారు. సైబర్ నేరస్తుల రకరకాలుగా ప్రజలను మోసం చేస్తున్నారని, వీటిని అరికట్టేందుకు నిత్యం పోలీస్ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే 1930కు కాల్ చేయాలని, జిల్లా టెక్నికల్ బృందం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. కేసులో విశేష కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని, ఐటీ కోర్ బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు.

ఉత్తీర్ణతా శాతం పెంపునకు కృషి

- ఇప్పటికే పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు
- ప్రభుత్వ హాస్టల్ భవనాలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు
- శంకర్ విలాస్ ఫ్లైఓవర్ డీపీఆర్ సిద్ధం కాగానే స్టేక్ హోల్డర్లతో సమావేశం
- 15లోగా రహదారులపై గుంతలు పూడ్చే పనులు పూర్తి చేస్తాం
- 'సాక్షి'తో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు చర్యలు చేపట్టామని, దీనికి అనుగుణంగా పదో తరగతి విద్యార్థులకు నవంబర్ నుంచే అదనపు తరగతులు నిర్వహిస్తున్నామని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని, ఆ దిశగా జిల్లా పాలన కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది అనేక లక్ష్యాలు పెట్టుకున్నామన్నారు. అవి సాకారమైతే జిల్లా అభివృద్ధితోపాటు ప్రజల ఆర్థిక స్థితిగతులు మరింత మెరుగవుతాయన్నారు. గురువారం 'సాక్షి'తో ఆమె జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు విషయాలు పంచుకున్నారు.

విద్యారంగంపై దృష్టి

కొన్నేళ్లుగా పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం తక్కువ నమోదు అవుతుండటంతో చర్యలు చేపట్టామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కూడా క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనాలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే వీటి కోసం రూ.నాలుగు కోట్ల నిధులు విడుదల అయ్యాయని వెల్లడించారు. జిల్లాలో ఉన్న 22 ప్రభుత్వ భవనాలకు అవసరమైన మరమ్మతులు చేసేందుకు టెండర్లు పిలిచామన్నారు. ఇటీవల హాస్టల్స్‌లో చోటు చేసుకున్న సంఘటనలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టామని పేర్కొన్నారు. ఒక వార్డెన్‌ను సస్పెండ్ చేశామన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

రహదారుల మరమ్మతులకు ప్రాధాన్యం

జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా చాలా వరకు రోడ్లు ధ్వంసం అయ్యాయి. ఇప్పటికే జిల్లాలో రోడ్ల మరమ్మతులు చివరి దశకు వచ్చాయి. ఈ నెల 15వ తేదీలోగా అన్ని రోడ్లపై గుంతలు పూడ్చే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

అతివలకు అండగా...

మహిళా ఆర్థిక సాధికారత దిశగా ముందుకు సాగాల్సిన పరిస్థితి ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. మహిళలు సొంతంగా చీరలు నేయడం, కలంకారీ వస్తువుల తయారీ, తినుబండారాలు, చిరుధాన్యాలతో వంటకాలు వంటి చేస్తున్నారని గుర్తుచేశారు. స్వయం ఉపాధి పొందుతున్న వారికి ఒక వేదిక ఏర్పాటు చేయాలన్న ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ లక్‌పతి దీదీలో పథకంలో ఇప్పటి వరకు సుమారు 55 వేల మంది మహిళలను గుర్తించామని తెలిపారు. ఈ సంఖ్యను ఈ ఏడాది లక్షకు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. స్వయం ఉపాధికి రుణాలిచ్చేలా బ్యాంకర్లతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

గుంటూరు నగరంలో శంకర్‌విలాస్ వద్ద ఫ్లై ఓవర్ నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చాలా కీలకమన్నారు. తాను నగర కమిషనర్‌గా ఉన్నప్పటి నుంచి దీన్ని విస్తరించాలన్న ఆలోచన జరిగిందన్నారు. ఫ్లై ఓవర్ ప్రస్తుతం డీపీఆర్ తయారీ స్టేజీలో ఉందని తెలిపారు. అది పూర్తి అయిన తర్వాత ఎంత మందికి సంబంధించిన స్థలాలు ఏ మేర ప్రభావితం అవుతాయన్నది తేలుతుందని చెప్పారు. అనంతరం విస్తరణ బాధితులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. వారి ఆలోచనలను, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా కొత్త ఫ్లై ఓవర్ పనులు చేపట్టడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

3,500 అర్జీల స్వీకరణ

గత నెల 6వ తేదీన జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ప్రారంభించామని చెప్పారు. ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. ప్రతి గ్రామం, మండలంలో రోజూ సదస్సులు జరుగుతున్నాయని వివరించారు. ఇప్పటి వరకు సుమారు 3,500 అర్జీలు అందాయన్నారు. వీటిలో కొన్ని ఇప్పటికే పరిష్కరించామని తెలిపారు. కొన్ని సమస్యలు సాంకేతిక కారణాలతో పెండింగ్ ఉన్నాయని పేర్కొన్నారు. సదస్సులు పూర్తి కాగానే స్వీకరించిన అర్జీలు పరిష్కరించేందుకు యంత్రాంగం పని చేస్తుందన్నారు. ఈ అర్జీల ద్వారా ప్రజలకు సంబంధించి సమస్యలు పూర్తిస్థాయిలో తెలుసుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ముక్కోటి ఏకాదశి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మంగళగిరి: మంగళగిరి పట్టణంలోని పానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను గురువారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ ముక్కోటి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సామాన్య భక్తులకు స్వామి వారి దర్శనం త్వరగా లభించేలా తగిన చూడాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఏ రామకోటిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డుకు 47,491 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 47,491 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 45,404 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 13,700 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 49,563 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,600

క్లుప్తంగా

గనికపూడిలో గ్రామసభ



గుంటూరు రూరల్: ప్రత్తిపాడు మండలం గనికపూడి పంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీని సందర్శించి, ప్రజల జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఇటీవల పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన వర్క్‌కు సంబంధించిన సీసీ రోడ్డు నిర్మాణం ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ని సందర్శించారు. క్లాప్ మిత్రలు సంఖ్య గురించి తెలుసుకున్నారు. రక్షిత మంచి నీటి చెరువు నుంచి షెడ్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఆయన్ను కోరారు. వివరాలు సమర్పించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కి సూచించారు. ఎంపీడీఓ కె. శివపార్వతి, విస్తరణ అధికారి జి.రవి కుమార్, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రీసోర్స్ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కల్యాణి, పంచాయతీ వార్డు మెంబర్ సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'తానా' నవలల పోటీకి రచనల ఆహ్వానం

తెనాలి: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) రెండేళ్లకోసారి నిర్వహించే నవలల పోటీని ఈ ఏడాది రూ.2 లక్షల బహుమతితో నిర్వహిస్తోంది. 1997 నుంచి జరుపుతున్న ఈ పోటీలను మధ్యలో కొంత విరామంతో 2017 నుంచి కొనసాగిస్తోంది. ఈ పోటీల్లో శప్తభూమి, నీల, ఒంటరి, కొండపొలం, మున్నీటి గీతలు, అర్ధనారి నవలలు పలు అవార్డులను గెలిచాయి. కొండపొలం సినిమాగా రాగా, మున్నీటి గీతలు వెబ్‌సిరీస్‌గా వస్తోంది. రాబోయే జులై 3,4,5 తేదీల్లో డెట్రాయిట్‌లో జరగనున్న తానా మహాసభల సందర్భంగా మళ్లీ నవలల పోటీలు జరుపుతున్నట్టు తానా కార్యక్రమ నిర్వాహకులు జంపాల చౌదరి, ప్రచురణల కమిటీ అధ్యక్షుడు చంద్ర కన్నెగంటి గురువారం ప్రకటించారు. రచయితలు తమ రచనలను ఏప్రిల్ 15వ లోగా అక్షర క్రియేటర్స్, ఏజి-2, ఎ-బ్లాక్, మాతృశ్రీ అపార్ట్‌మెంట్స్, హైదర్‌గూడ, హైదరాబాద్-500029 చిరునామాకు పంపాలని వివరించారు. 98493 10560, 99496 56668 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

కార్మికుల నెత్తిన తమ్ముళ్ల 'బండ'

తాడికొండ మండలం లాం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అక్రమ క్వారీయింగ్‌కు తెరలేపారు. దొరికినంత దోచుకో.. అన్నట్లుగా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొండను పిండి చేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు గుట్టుచప్పుడు కాకుండా రాత్రిళ్లు తరలించి సొమ్ము చేసుకున్నారు. అధికారులు అటువైపు చూసిన దాఖలాలు లేకపోవడంతో ఇప్పుడు దందా కాస్తా పట్టపగలే కొనసాగుతుండటం విశేషం. క్వారీ సొసైటీ కార్మికుల పొట్టగొడుతున్నారు.

- లాంలో టీడీపీ నేతల అక్రమ క్వారీయింగ్
- అనుమతుల్లేకుండా బ్లాస్టింగ్‌తో గ్రావెల్ తరలింపు
- క్వారీ సొసైటీని సైతం లెక్కచేయకుండా పనులు
- జనావాసాల మధ్య అడ్డగోలుగా మైనింగ్
- కళ్లు మూసుకున్న మైనింగ్, రెవెన్యూ యంత్రాంగం



అనుమతుల్లేకుండా బ్లాస్టింగ్ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



కుర్చీలు వేసుకొని మరీ మైనింగ్ చేయిస్తున్న తమ్ముళ్లు

లాం (తాడికొండ): స్థానికంగా కొండకు క్వారీయింగ్ చేసుకునేందుకు గత 40 సంవత్సరాలకుపైగా ది లాం క్వారీ సొసైటీ అధికారికంగా ఎన్నికలు నిర్వహించింది. ఎన్నికై ఉపాధి కోసం పలువురు కార్మికులు పనులు చేసుకొని బతుకుతున్నారు. అయితే దీనిపై అక్కసుతో టీడీపీ నాయకులు ఎప్పటి నుంచో కన్నేసి అడుగడుగునా అడ్డంకులు కల్పిస్తున్నారు. తప్పుడు కేసులు సైతం పెట్టి గతంలో పలుమార్లు అడ్డుకున్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో సొసైటీ నిబంధనలకు తూట్లు పొడిచి అంతా తమ ఇష్టం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కొండలను మింగే పనిలో పడ్డారు. దీనిపై క్వారీ సొసైటీ సభ్యులు పలుమార్లు మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకున్న నాథుడే లేడని పలువురు మండి పడుతున్నారు.

ఏ చిన్న పొరపాటు జరిగినా...

మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి కూతవేటు దూరంలో జనావాసాలు ఉన్నప్పటికీ టీడీపీ వారికి పట్టడం లేదు. ఏ చిన్న పొరపాటు జరిగినా తీరని నష్టం జరిగి తమ ప్రాణాలకు ముప్పు పొంచి ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు తూట్లు పొడిచి క్వారీ సొసైటీకి సంబంధం లేకుండా టీడీపీ నాయకులు దగ్గరుండి మరీ బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారు. గ్రావెల్, రాళ్లను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఇక్కడ బ్లాస్టింగ్‌కు అనుమతులు లేవు. కేవలం సొసైటీలో సభ్యులు మాత్రమే ఉపాధి పొందేందుకు అవకాశం ఉంది. అయినప్పటికీ అక్రమంగా దందా కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సంబంధిత రెవెన్యూ, మైనింగ్ అధికారులు స్పందించి ఇకనైనా అక్రమ తరలింపును అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు. మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదు.

అధికారులకు చెప్పినా చర్యలు శూన్యం

ఈ దందాపై మైనింగ్ కార్యాలయంలో డీఈ, ఏఈలకు తెలియజేసినా వస్తున్నామంటున్నారు కానీ ఇటు వైపు చూడటం లేదు. ఉపాధి పొందుతున్న కార్మికుల పొట్టగొట్టి టీడీపీ నాయకులు దోచుకుంటున్నారు. ఎవరైనా గట్టిగా మాట్లాడితే ఎక్కడ తప్పుడు కేసులు పెడతారో అని భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

– షేక్ సాదిక్,
క్వారీ సొసైటీ అధ్యక్షుడు, లాం

భూములిచ్చిన రైతులకు శుభవార్త

రిటర్నబుల్ ప్లాట్స్ ఇచ్చేందుకు ఏర్పాట్లు

తాడేపల్లి రూరల్ : రాజధాని పరిధిలోని ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ కింద రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు రిటర్నబుల్ ప్లాట్స్ ఇచ్చేందుకు గురువారం సన్నాహాలు చేపట్టారు. దానిలో భాగంగా ఆయా గ్రామాల్లోని సీఆర్‌డీఏ కార్యాలయంలో రిటర్నబుల్ ప్లాట్ల జాబితా వివరాలు అందుబాటులో ఉంచారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని డిప్యూటీ కలెక్టర్ చిన్నికృష్ణ తెలిపారు. జనవరి నెలాఖరు వరకు ఉదయం 10 – సాయంత్రం 5 గంటల మధ్య అభ్యంతరాలు చెప్పొచ్చని పేర్కొన్నారు. యూనిట్ సర్వేయర్ కె.అశోక్ – 97002 26636, గ్రామ సర్వేయర్లు అంకారావు 81791 34934, బి. మెహబూబ్ 86887 35648 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



పెనుమాక సీఆర్‌డీఏ కార్యాలయంలో నోటీసు బోర్డులో ఉంచిన రైతుల జాబితా

లక్ష కార్డుల ఉద్యమానికి మద్దతు

కవి డాక్టర్ కత్తి పద్మారావు



పొన్నూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను ఆరో తరగతి నుంచి ఎంఏ వరకు పాఠ్యాంశంగా పెట్టాలని చేపట్టిన లక్ష కార్డుల ఉద్యమానికి తెలుగు రచయితలు పలువురు మద్దతు ప్రకటించారని దళిత మహాసభ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కవి డాక్టర్ కత్తి పద్మారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు విచ్చేసిన మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే కె.శివాజీ, మాజీ ఎంపీ వి.వి. లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కవి ఆరవ జైపాల్, మాజీ డీఈఓ ఎ. జగదీష్, రచయిత గజేంద్రరావు తదితర రచయితలు, కవులు, సాహితీవేత్తలు, విమర్శకులు, మేధావులు, కళాకారులు, ఉపాధ్యాయులు మద్దతు తెలిపారన్నారు. ముఖ్యమంత్రికి పంపించే పోస్టు కార్డులపై వారు సంతకాలు చేశారని తెలిపారు. పాఠ్యాంశాల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తామని కత్తి పద్మారావు అన్నారు.

జగనన్న కాలనీలో విజిలెన్స్ బృందం పరిశీలన



గణపవరం జగనన్న కాలనీలో పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

నాదెండ్ల: గణపవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని జగనన్న కాలనీని విజిలెన్స్ అధికారులు గురువారం సందర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో 1200 మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేశారు. అనంతరం లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలు అందించారు. గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు దిగువ భాగాన సర్వే నెంబర్లు 80, 81, 94, 95, 96లలో సుమారు 29.76 సెంట్ల భూమిని కావూరు లింగంగుంట్ల వెళ్ళే రోడ్డులో వీరాంజనేయస్వామి ఆలయం పక్కనే మరో మూడెకరాలు ప్రభుత్వం సేకరించి లబ్ధిదారులకు ప్లాట్లుగా అందించింది. జిల్లా విజిలెన్స్ అధికారి సీహెచ్ శివాజీ, ఏవో ఆదినారాయణ, శ్రీరాంమూర్తిలు కాలనీని సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం భూమిని సేకరించకముందు భూమి ధరలు, సేకరించిన తరువాత ధరలను సమీక్షించారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఆదిలక్ష్మి, అంకమ్మరావు, గ్రామ సర్వేయర్లు ప్రసన్నకుమారి, పవన్‌కుమార్, అనిల్, శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బాషా, సంతోష్, ఉమాదేవి పాల్గొన్నారు.

డీఆర్పీల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ, పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ పథకం ద్వారా జిల్లా రిసోర్స్ పర్సన్స్ (డీఆర్పీఎస్) ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ పీడీ బి.బాలూనాయక్ గురువారం తెలిపారు. ఈ పథకం క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ ప్రోగ్రామ్‌గా చిన్న తరహా ఆహార ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్‌ను ప్రోత్సహించడాన్ని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు పీఎంఎఫ్‌ఎంఈ పథక నోడల్ ఏజెన్సీ అయిన ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా డీఆర్పీలుగా నియమితులవుతారని, స్థిరమైన నెలవారీ వేతనం ఉండదని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలోని ప్రతి మండలానికి ఒక డీఆర్పీని రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. నియమితులైన డీఆర్పీలు తగిన పారిశ్రామికవేత్తలను గుర్తించడం, పీఎంఎఫ్ఎంఈ పథకం వివరించడం, సరైన ఆహార ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ ఆలోచనలను సూచించడం, డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేయడం, బ్యాంకులతో సమన్వయం చేసి రుణాలను సమకూర్చడం, యూనిట్ స్థాపన, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ఉద్యం యాప్ నందు నమోదు పూర్తి చేయుటలో సహకరించడం వంటి పనులను నిర్వహిస్తారన్నారు. పనితీరు ఆధారంగా ఇన్సెంటివ్స్ అందిస్తారని పేర్కొన్నారు. బ్యాంకు రుణం పొందిన తర్వాత రూ.10 వేలు, డీపీఆర్ ప్రకారం యూనిట్ స్థాపన, అధికారికత పూర్తయిన తర్వాత మరో రూ.10 వేలు అందిస్తారన్నారు. ఏదైనా గ్రాడ్యుయేషన్ చేసి, స్మార్ట్ ఫోన్ కలిగి ఉండాలన్నారు. ఇంటర్నెట్, కంప్యూటర్‌పై పరిజ్ఞానం ఉండాలన్నారు. 2024 నవంబర్ 1 నాటికి వయసు 30 ఏళ్లకు మించకూడదన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ లేదా నాచ్యురల్ డెవలప్మెంట్ కార్యకలాపాలలో అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. దరఖాస్తు చేయడానికి ఈనెల 5 చివరి తేదీ అని, ఆసక్తి ఉన్న నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు ఈనెల ఐదు లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాల సూచించారు.

మద్యం మత్తులో ఘర్షణ.. ఒకరికి కత్తిపోట్లు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొలనుకొండలో మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఓ యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొలనుకొండకు చెందిన గుడిపూడి తేజ, గణేష్ స్నేహితులు. ఆటోలో మద్యం తాగుతుండగా వెంకటేష్ అనే వ్యక్తి వచ్చి గణేష్‌తో గొడవకు దిగాడు. తేజ నచ్చజెప్పి పంపించాడు. తేజ అత్త వారింటికి వచ్చి మరోసారి వెంకటేష్ గొడవకు దిగాడు. అప్పుడు ఘర్షణలో వెంకటేష్ కత్తితో దాడి చేశాడు. తేజకు పొత్తి కడుపులో, ఛాతీ కింద భాగంలో గాయాలయ్యాయి. బాధితుడ్ని బంధువులు వైద్య నిమిత్తం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు తేజను విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటయ్య తెలిపారు.

ఎస్జీటీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ప్రభుత్వ విద్యా కార్యక్రమాల సమన్వయం, నిరంతర పర్యవేక్షణ నిమిత్తం తాత్కాలికంగా పని చేసేందుకు అర్హత, ఆసక్తితో పాటు పూర్తిస్థాయిలో కంప్యూటర్ పరిజ్ఞానం గల ఎస్జీటీలు దరఖాస్తు చేసుకోవాలని ఆర్జేడీ బి. లింగేశ్వర రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను అన్ని అర్హతలతో కూడిన ధ్రువపత్రాలతో ఈ నెల 7వ తేదీలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

బ్రాహ్మణపల్లిలో పేకాట శిబిరంపై దాడి

13 మంది జూదరుల అరెస్టు



పిడుగురాళ్ల: బ్రాహ్మణపల్లిలో రహస్యంగా నిర్వహిస్తున్న హైటెక్ పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. 13 మంది జూదరులను అరెస్టు చేశారు. పిడుగురాళ్లకు చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు బ్రాహ్మణపల్లిలోని వివేరా రెస్టారెంట్‌లో ఓ గది అద్దెకు తీసుకుని చాలా రోజులుగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పిడుగురాళ్ల పట్టణ పోలీసులు గురువారం శిబిరంపై దాడి చేశారు. రూ.60,885 స్వాధీనం చేసుకున్నారు. 13 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడెం నుంచి ఇక్కడికి పేకాట ఆడేందుకు వచ్చినట్లు తెలిసింది. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ మోహన్ తెలిపారు.

పాల ట్యాంకర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన గురువారం సంతమాగులూరు మండలం పాతమాగులూరు వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ పట్టాభిరామయ్య వివరాల మేరకు.. నరసరావుపేటకు చెందిన రంగా శివ (30) స్కూటీ మీద సంతమాగులూరు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను గమనించక ఢీకొట్టాడు. స్కూటీ లారీ వెనుక వైపు దూసుకుపోవటంతో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేశ ప్రగతికి బాటలు వేసిన మన్మోహన్

రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ



మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ గతిని ప్రగతి వైపు మరల్చిన మహనీయుడు మన్మోహన్ సింగ్ అని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంస్మరణ సభను కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో గురువారం నిర్వహించారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రధాన వక్తగా శివాజీ మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని ప్రపంచీకరణ సూత్రాన్ని పాటిస్తూ, సరళీకృత ఆర్థిక విధానాలతో అభివృద్ధి వైపు పరుగులెత్తించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రపంచంలోనే అరుదైన రాజకీయవేత్తగా నిలిచారని కొనియాడారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు అనేక పార్లమెంటరీ ఫైనాన్స్ స్థాయి కమిటీల్లో సభ్యునిగా మన్మోహన్ సింగ్‌తో కలిసి పనిచేసే అదృష్టం దక్కిందని గుర్తు చేసుకున్నారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా నిస్వార్థంగా దేశం కోసం పని చేశారని కొనియాడారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ వడ్లమాని రవి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా దేశంలో పేదలకు పని కల్పించి, పేదరికాన్ని పారదోలేందుకు మన్మోహన్ కృషి చేశారని అన్నారు. దేశ ప్రజలకు సంపూర్ణ విద్య హక్కు కల్పించి చైతన్య పరిచారని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సామాన్యులకు చేరువయ్యారని తెలిపారు. ఆర్థిక సంస్కరణలతో దేశంలో అభివృద్ధి బాటలు పరిచారని కొనియాడారు. ఆయన ప్రధానమంత్రిగా అమలు చేసిన ప్రపంచీకరణ విధానాలతో నేడు దేశ ప్రజలందరూ అభివృద్ధి ఫలాలను ఆస్వాదిస్తున్నారని గుర్తుచేశారు. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఆర్థిక శాఖ మంత్రిగా మన్మోహన్ సింగ్‌కి పూర్తి స్వేచ్ఛనిచ్చి ఆర్థిక సంస్కరణలను కఠినంగా అమలు చేసే విధంగా సహకరించారని వివరించారు. భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ.. ప్రస్తుత దేశ రాజకీయాల్లో మన్మోహన్ సింగ్ వంటి నాయకులు లేరని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, విధానాలు నిత్యం దేశ ప్రగతికే పరితపించాయని తెలిపారు. గాయకుడు గజల్ శ్రీనివాస్, సాహితీ సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ కాకినాడ జిల్లా చైర్మన్ వైడీ రామారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి



శంకర్ విలాస్ ఫ్లై ఓవర్ నమూనాను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్ : నగరంలోని శంకర్ విలాస్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల సమయంలో వాహనదారులు ఇబ్బంది పడకుండా రహదారులను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో దీనికి సంబంధించి అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పనులు ప్రారంభమైతే ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక ప్లానింగ్ ప్రకారం అమరావతి రోడ్డు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా బస్టాండ్ వైపునకు, లైట్ మోటారు వాహనాలు పొట్టి శ్రీరాములు జంక్షన్ నుంచి మూడు వంతెనల వైపునకు మళ్లించాలన్నారు. లక్ష్మీపురం వైపు నుంచి వచ్చే వాహనాలను లాడ్జీ సెంటర్ నుంచి కంకరగుంట ఆర్వోబీ వైపు.. పాఠశాల బస్సులు, ఇతర భారీ వాహనాలను కంకరగుంట ఫ్లై ఓవర్ మీదుగా గుజ్జనగుండ్ల వైపునకు మళ్లించాల్సి ఉంటుందన్నారు. ప్రత్యామ్నాయ రహదారులలో ఆక్రమణలు తొలగించడంతోపాటు అడ్డగోలుగా పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. బ్రాడీపేట 14 అడ్డరోడ్డు రైల్వే గేటును తిరిగి తెరిపించాలని పేర్కొన్నారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎస్పీ సతీష్‌కుమార్, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థి ఛాతీ కొలుస్తున్న పోలీస్ అధికారి

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన గురువారం 264 మంది హాజరయ్యారు. అందులో 18 మంది ధ్రువపత్రాలను సమర్పించలేదు. మిగతా 246 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించారు. వారిలో 31 మంది ఛాతీ, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. ఇక 215 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు జరగ్గా, 33 మందిని అనర్హులుగా ప్రకటించారు. 182 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. 182 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో 68 మంది అర్హత సాధించగా, 114 మంది అనర్హత పొందారు. 182 మందికి లాంగ్ జంప్ చేపట్టగా 167 మంది అర్హత, 15 మంది అనర్హతకు చేరుకున్నారు. 246 మంది కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో 166 మంది అర్హత సాధించగా, 79 మంది అనర్హత పొందారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), ఎ.హనుమంతు (ఏఆర్), పలువురు పోలీస్ అధికారులు పర్యవేక్షించారు.

నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధికి కృషి ముఖ్యం

తెనాలి: నీటిపారుదల వ్యవస్థ సమగ్ర అభివృద్ధికి కృష్ణా పశ్చిమ డెల్టాకు నూతనంగా ఎన్నికైన ప్రాజెక్టు కమిటీ కృషి చేయాలని డెల్టా ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పులిపాటి వెంకటరత్నం సూచించారు. జలవనరుల శాఖ, తెనాలి డివిజన్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం కమిటీ తొలి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. చైర్మన్ పంతాని మురళీధరరావు అధ్యక్షత వహించారు. కమిటీ పరిధిలోని 22 డిస్ట్రిబ్యూటరీ కమిటీల నాయకులు పాల్గొన్నారు. ఈఈ వెంకటరత్నం మాట్లాడుతూ.. చట్టంలో పేర్కొన్న ఉపసంఘాలను ఎన్నుకోవాలన్నారు. పశ్చిమ డెల్టా పంట కాల్వలు, డ్రైనేజీలకు రాబోయే సీజనులో చేపట్టాల్సిన పనులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. చైర్మన్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. వైస్ చైర్మన్ సునీల్ చౌదరి మాట్లాడుతూ.. డెల్టా చివరి భూముల వరకు సాగునీరందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్థిక వనరులు, నీటి యాజమాన్యం, పర్యవేక్షణ – మూల్యాంకన – శిక్షణ ఉపసంఘాలను ఎన్నుకున్నారు. వాటి కార్యకలాపాలను చర్చించుకున్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీల చైర్మన్లు తమ పరిధిలోని పంటకాల్వలు, మురుగు కాల్వల సమస్యలు వివరించారు. డివిజన్ కార్యాలయ పర్యవేక్షకుడు డీపీ అనిల్‌కుమార్, పులిపాటి వెంకటరత్నం, నరసరావుపేట ఎన్ఎస్పీ ఇన్‌చార్జి ఈఈ ఏవీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో భేటీ



ఆచార్య కె.మధుమూర్తితో మాట్లాడుతున్న డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కోర్సుల డీన్ ఆచార్య కొల్లా శ్రీనివాస్ గురువారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. మధుమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. మధుమూర్తికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇంజినీరింగ్ కోర్సులు, కళాశాలలు, విద్యార్థుల ప్రవేశాలు, ఉపాధి అవకాశాలు, ఇన్నోవేషన్ తదితర కార్యక్రమాలపై వారు చర్చించారు. సమావేశంలో ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.పూర్ణ చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీల పాత్ర కీలకం



మాట్లాడుతున్న విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల పాత్ర కీలకమని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి. విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీ సభ్యులకు విధులు, బాధ్యతలపై శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తూ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు వచ్చే విధంగా పర్యవేక్షించాలని సూచించారు. నాణ్యమైన విద్యాబోధనతోపాటు విద్యార్థుల ప్రగతిని నిరంతరం పరిశీలించాలని కోరారు. శిక్షణ కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్ఎంఎం అబ్దుల్ ఖుద్దూస్, జ్యోతికిరణ్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర తదితరులు పాల్గొన్నారు.